సాక్షి
నల్లగొండ
సోమవారం । 8 । జనవరి । 2024



'మిర్యాల' బస్సుకు ప్రమాదం
ఏపీలోని నెల్లూరు జిల్లాలో మిర్యాలగూడ డిపో బస్సు ప్రమాదానికి గురై జిల్లాకు చెందిన ఇద్దరు మృతిచెందారు. - 8లో



సమస్యలు పరిష్కరించాలి
విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని శాసన మండలి సభ్యుడు అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. - 8లో



ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవాలి
పరిశ్రమల్లో వ్యర్థాల శుద్ధి ప్లాంట్లను ఏర్పాటు చేసుకోవాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కోరారు. - 10లో

న్యూస్‌రీల్

9న స్థాయీ సంఘాల సమావేశాలు

నల్లగొండ : జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈ నెల 9వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు నల్లగొండలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30కు ఆర్థిక, పనులు, గ్రామీణాభివృద్ధి, విద్యా వైద్యం స్థాయీ సంఘాల సమావేశాలు ఉంటాయని.. మధ్యాహ్నం 12 గంటలకు వ్యవసాయం, 2 గంటలకు స్త్రీ, శిశు సంక్షేమం, 3.30 గంటలకు సాంఘిక సంక్షేమం స్థాయీ సంఘాల సమావేశాలు ఉంటాయని వెల్లడించారు. ఈ సమావేశాలకు సభ్యులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వరలక్ష్మి

మిర్యాలగూడ అర్బన్ : మహిళా హక్కుల సాధన కోసం, మహిళల్లో ఐక్యత పెంచేందుకు ఐద్వా ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీన చేపట్టబోయే సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పోలెబోయిన వరలక్ష్మి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఐద్వా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వాలు మహిళల అభివృద్ధికి పాటుపడాలని, మహిళలపై జరుగుతున్న దాడులను, అత్యాచారాలను అరికట్టాలని కోరారు. సమావేశంలో ఐద్వా సీనియర్ నాయకురాలు గాదె పద్మ, కంచర్ల ఊర్మిళ, ఓగోటి పూలమ్మ, మహాలక్ష్మి తదితరులున్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

రామగిరి(నల్లగొండ) : గురుకుల పాఠశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు గడువు జనవరి 20వ తేదీ వరకు పొడిగించినట్లు ఎస్సీ గురుకుల ఆర్‌సీఓ హెచ్.అరుణకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో రూ.100 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

గురుకులాల్లో కేర్ టేకర్లను నియమించాలి



మాట్లాడుతున్న దిలీప్‌కుమార్‌రెడ్డి

రామగిరి(నల్లగొండ) : గురుకుల విద్యాలయాల్లో కేర్ టేకర్లను నియమించాలని పీఆర్‌జీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు వేమిరెడ్డి దిలీప్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఆదివారం నల్లగొండలోని పీఆర్‌టీయూ భవన్‌లో నిర్వహించిన ఉమ్మడి నల్లగొండ జిల్లా గురుకుల ఉపాధ్యాయ సమావేశంలో ఆయన మాట్లాడారు. టీజీటీ కేడర్‌కు సమానంగా ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్లను అప్‌గ్రేడ్ చేయాలని, రెండవ శనివారం సెలవు ప్రకటించాలని, పబ్లిక్, జనరల్ సెలవుల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు సీసీఎల్ పెట్టుకునే అవకాశం కల్పించాలని కోరారు. అనంతరం టేబుల్ క్యాలెండర్ ఆవిష్కరించారు. సమావేశంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వి.ఫణికుమార్, జనరల్ సెక్రటరీ కె.నారాయణరెడ్డి, డాక్టర్ ఏ.నరేష్, ఎం.వేణుప్రసాద్, స్వప్న, ఉప్పు అశోక్, డాక్టర్ శ్రీనివాసాచారి, డాక్టర్ నిర్మలానందం, కె.రామకృష్ణారెడ్డి, పి.విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

నృసింహుడికి లక్ష పుష్పార్చన

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఆదివారం ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని లక్షపుష్పార్చన పూజలను ఆగమశాస్త్రం ప్రకారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ముఖ మండపంలో ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి వివిధ రకాల పుష్పాలతో అర్చన చేశారు. అదే విధంగా ప్రధానాలయంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, జోడు సేవలు తదితర కైంకర్యాలు గావించారు.



పుష్పార్చన చేస్తున్న ఆచార్యులు





● రామాలయంలో ప్రవచనాలు

ధనుర్మాస ఉత్సవాల సందర్భంగా ఆదివారం నల్లగొండలోని రామగిరి రామాలయంలో భక్తులకు అండాల్ అమ్మవారి ప్రవచనాలు చెబుతున్న త్రిదండి దేవనాథ రామానుజ జీయర్‌స్వామి, ప్రవచనాలకు హాజరైన భక్తులు - రామగిరి(నల్లగొండ)

'సైన్స్‌ఫేర్' ఆన్‌లైన్!

- ఎన్నికల కారణంగా ఇన్‌స్పైర్ మనక్ ప్రదర్శనలు వాయిదా
- సమయం తక్కువగా ఉండడంతో ఆన్‌లైన్‌లో నిర్వహణ
- జిల్లాస్థాయి ప్రదర్శనకు 143 ప్రాజెక్టులు ఎంపిక
- ప్రాజెక్టుల ఆన్‌లైన్‌లో అప్‌లోడ్‌కు 18వ తేదీ వరకు చాన్స్



నల్లగొండ : పాఠశాల స్థాయిలోనే విద్యార్థులను బాల శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం కేంద్ర శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖ ప్రతి సంవత్సరం ఇన్‌స్పైర్ మనక్ పోటీలను నిర్వహిస్తోంది. అందులో భాగంగానే 2022–23 సంవత్సరంలో ఇన్‌స్పైర్ మనక్ ప్రదర్శనలు నిర్వహించేందుకు దేశ వ్యాప్తంగా విద్యార్థుల నుంచి ఆలోచనలు ఆహ్వానించింది. ఇందుకోసం జిల్లా నుంచి విద్యార్థులు పలు ప్రాజెక్టుల ఆలోచనలను ఆన్‌లైన్‌లో పంపారు. వాటిలో 143 ప్రాజెక్టులు జిల్లాస్థాయిలో ప్రదర్శనకు ఎంపికయ్యాయి. ఆ ప్రాజెక్టులను ప్రదర్శించేందుకు విద్యార్థుల అకౌంట్లలో రూ.10 వేలు జమ చేశారు. వాటికి సంబంధించి గతేడాది నవంబర్‌లోనే ప్రదర్శన నిర్వహించాల్సి ఉండగా ఎన్నికల కారణంగా వాయిదా పడింది. సమయం తక్కువగా ఉండటం వల్ల ఈసారి ఇన్‌స్పైర్ మనక్ ప్రదర్శనలు ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నారు.

18వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్..

జిల్లా స్థాయిలో వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైన 143 ప్రాజెక్టులను విద్యార్థులు ఈ నెల 18వ తేదీలోగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంది. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులకు సంబంధించి వీడియో, ఆడియోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. ఒక్కో వీడియో నిడివి రెండు నిమిషాలు. డాటా 30 ఎంబీ దాటకూడదని నిర్ణయించారు.

షెడ్యూల్ ఇలా..

ఈ నెల 18 వరకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో ప్రాజెక్టులను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. 19 నుంచి 25 వరకు మూల్యాంకనం చేస్తారు. ఉత్తమ ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వాటిని ఫిబ్రవరి 1 నుంచి 3వ తేదీ వరకు మూల్యాంకనం చేస్తారు. ఆ తర్వాత జాతీయ స్థాయికి ప్రాజెక్టులను ఎంపిక చేస్తారు.

ప్రధానోపాధ్యాయులు చొరవ చూపాలి



జిల్లాస్థాయికి ఎంపికైన ప్రాజెక్టులన్నీ ఆన్‌లైన్‌లో ప్రదర్శించేలా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చొరవ తీసుకోవాలి. ఇన్‌స్పైర్ మనక్ వల్ల విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ బయటకు రావడంతో పాటు పాఠశాల స్థాయి నుంచే బాల శాస్త్రవేత్తలుగా తయారయ్యే అవకాశం ఉంటుంది. విద్యార్థులు తయారు చేసే ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యే విధంగా ఉండేలా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలి.
– భిక్షపతి, డీఈఓ

ముగ్గురు న్యాయ నిర్ణేతలు..

విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలించేందుకు నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ నుంచి ఒక్కరు, జిల్లా నుంచి ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించనున్నారు. ఆ ముగ్గురు ఆన్‌లైన్‌లోనే పరిశోధనలు పరిశీలిస్తారు. ప్రతి నమూనాకు పది చొప్పున మార్కులు ఉంటాయి. ప్రతిభ ఆదారంగా మార్కులు కేటాయిస్తారు. ప్రతి జిల్లాలో ఎంపికైన ప్రదర్శనల్లో పది శాతం ప్రాజెక్టులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తారు.

సమస్యల పరిష్కారానికి పోరాడుతాం



సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్‌రెడ్డి

నల్లగొండ : సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తామని మైనారిటీ గురుకుల ఉపాధ్యాయ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు, టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. టీఎస్ యూటీఎఫ్ మైనారిటీ గురుకుల ఉమ్మడి జిల్లా ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నల్లగొండలోని యూటీఎఫ్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కమిటీ నిర్మాణం ద్వారా దశల వారీ కార్యక్రమం చేపట్టి సమస్యల పరిష్కారానికి పోరాడుతామని తెలిపారు. మైనార్టీ గురుకుల వ్యవస్థను, ఇతర సొసైటీలు ఒకే గొడుగు కిందకు తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో మహేష్, నరసింహ, జి.క్రాంతికుమార్, బొల్లం కృష్ణమూర్తి, జిల్లా సమన్వయ కమిటీ సభ్యులు కొప్పుల జనార్దన్, లక్ష్మణ్ పాల్గొన్నారు. అనంతరం ఉమ్మడి జిల్లా మైనారిటీ గురుకుల ఉపాధ్యాయ విభాగం కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా బొల్లెం కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శిగా ప్రసాద్, కోశాధికారిగా కోమటి రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా జ్యోతిబాబు, నూర్జహన్, జిల్లా కార్యదర్శులుగా శంకర్, కె.రమాదేవి, అబ్దుల్ ముజీబ్, జంగయ్య, శ్వేత, అనిత ఎన్నికయ్యారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నల్లగొండ టౌన్ : ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాబు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం నల్లగొండలోని మగ్దూం భవన్‌లో జరిగిన రీజియన్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కుల కోసం ఎంప్లాయీస్ యూనియన్ అండగా నిలిచి పోరాడుతుందన్నారు. ఆర్టీసీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీలు, డీఏ ఏరియర్స్, సీసీఎస్, పీఎఫ్ బకాయిలు వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆర్టీసీలో కార్మిక సంఘాలను వెంటనే పునరుద్ధరించాలని కోరారు. సమావేశంలో పల్లా దేవేందర్‌రెడ్డి, వెంకట్‌గౌడ్, మంగ, బాసాని వెంకటయ్య, ఎండీ.మైనుద్దీన్, ఏ.లింగాస్వామి, నర్సింహ, శ్రీను, హరి, మన్సూర్, దాస్, హసన్‌బాబా, ఇబ్రహీం, మల్లయ్య, జానిపాషా, ప్రభాకర్, వి.ఎస్.రెడ్డి, సత్తయ్య, జలంధర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాబు

పేదలకు 'ఉపాధి' పనులు కల్పించాలి

నల్లగొండటౌన్ : గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా పేదలకు పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య డిమాండ్ చేశారు. ఆదివారం నల్లగొండలో నిర్వహించిన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం 200 రోజులు పని కల్పించి ఉపాధి కూలి రూ.1000 చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలనలో పథకాల కోసం దరఖాస్తు చేసుకున్న పేదలందరికీ వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రవణ్ కుమార్, కార్యదర్శి బొలుగూరి నరసింహ, రామకోటి, వెంగళయ్య, వేముల బుచ్చయ్య, ఉప్పునూతల రమేష్, హుస్సేన్, సైదులు, బోడ మల్లేష్, శంకర్‌నాయక్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

కొరవడిన సాగర్ ఎర్త్‌డ్యాం నిర్వహణ



గడ్డి, పిచ్చిమొక్కలతో ఉన్న సాగర్ ఎర్త్ డ్యాం

నాగార్జునసాగర్ : తెలుగు రాష్ట్రాలకు తాగు, సాగు నీరందిస్తూ.. ఆధునిక దేవాలయంగా విరాజిల్లుతున్న నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఎర్తుడ్యాం నిర్వహణ కొరవడింది. ఏడేళ్ల క్రితం డ్యాంపై పచ్చిక (గరక తెప్పలు) పరిచారు. ఆ గ్రాస్‌కు నీరు సరిగా పెట్టకపోవడంతో గడ్డి చనిపోయింది. ఇప్పుడు ఎర్త్‌డ్యాంపై తుంగ పిచ్చిమొక్కలు, కామంచి కలుపు మొక్కలు, జిల్లేడు, తంగేడు, కంపచెట్లు పెరుగుతున్నాయి. చాలా చోట్ల పుట్టలు ఏర్పడ్డాయి. గతంలో పార్కులతో పాటు ఎర్తుడ్యాంపై తోటమాలులు పనిచేసేవారు. ఇప్పుడు వారు లేరు. డ్యాం డివిజన్‌లో పనిచేస్తున్న ఎన్ఎంఆర్ (నాన్‌మస్టర్‌రోల్)లతో గడ్డి పీకిస్తున్నారు. ఏడేళ్ల క్రితం గ్రాస్ పరిచినపుడు ఇనుప పైపులను తొలగించారు. హెచ్‌డీపీఈ పైపులు వేశారు. వాటితో ఏనాడూ నీరు పెట్టలేదు. అధికారులు డ్యాం నిర్వహణను పట్టించుకోకపోవడంతో ఎర్త్‌డ్యాంపై ఎలుకలు చేరి మట్టిని తవ్వితే బుంగలు పడే ప్రమాదం ఉంటుంది. గతంలో పడిన బుంగను మూయడానికి మరోసారి ఎర్తు డ్యాంకు పూర్తిగా గ్రౌటింగ్ చేయాల్సి వచ్చింది. ఇప్పటికైనా అధికారులు పిచ్చి గడ్డిని తొలగించి లాన్ గ్రాస్ పరచాల్సిన ఆవశ్యకత ఎంతైన ఉంది.

నేడు నీలగిరి మున్సిపల్ సమావేశం

- చైర్మన్ సైదిరెడ్డిపై అవిశ్వాసం పెట్టిన కాంగ్రెస్
- 50 మంది సభ్యులకు మాత్రమే లోపలికి అనుమతి
- కో ఆప్షన్ సభ్యులు, మీడియాకు నోఎంట్రీ
- సమావేశాన్ని వీడియో తీయనున్న యంత్రాంగం



నల్లగొండ మున్సిపల్ కార్యాలయం

నల్లగొండ టూటౌన్ : నీలగిరి మున్సిపల్ సమావేశం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 11.30 గంటలకు నిర్వహించనున్నారు. గత నెలలో మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డిపై కాంగ్రెస్ కౌన్సిలర్లు జిల్లా కలెక్టర్‌కు అవిశ్వాస నోటీస్ అందజేసిన విషయం తెలిసిందే. ఈనెల 8వ తేదీన అవిశ్వాస సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇప్పటికే కలెక్టర్ నుంచి 48 మంది కౌన్సిలర్లతోపాటు ఇద్దరు ఎక్స్ అఫిషియో సభ్యులకు నోటీసులు అందించారు.

కలెక్టర్ ఆధ్వర్యంలో సమావేశం..

మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించే అవిశ్వాస సమావేశం కలెక్టర్ ఆధ్వర్యంలో జరుగనుంది. ఈ సమావేశానికి 48 మంది కౌన్సిలర్లు, ఇద్దరు ఎక్స్ అఫిషియో సభ్యులను మాత్రమే అనుమతించనున్నారు. అదేవిధంగా మున్సిపల్ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్, మరో ఇద్దరు ఉద్యోగులు లోపలికి వెళ్తారు. అవిశ్వాస సమావేశం కావడంతో కోఆప్షన్ సభ్యులకు ఓటు వేసే ఉండకపోవడంతో వారికి సమావేశ మందిరంలోకి అనుమతి లేదు. అదేవిధంగా మీడియాను కూడా అనుమతించడం లేదు. అవిశాస తీర్మానంపై నిర్వహించే ఈ సమావేశాన్ని మొత్తం వీడియో తీయనున్నారు.

బలాబలాలు తారుమారు..

గత మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ 21, కాంగ్రెస్ 19, బీజేపీ 6, ఎంఐఎం ఒకటి, స్వతంత్ర అభ్యర్థి ఒకరు గెలిచారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించడంతో మున్సిపల్ కౌన్సిల్లో పార్టీల బలాబలాలు పూర్తిగా తారుమారయ్యాయి. బీఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరడంతో ఆ పార్టీ బలం 34కు చేరింది. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ఎక్స్ అఫిషియో ఓట్లతో కాంగ్రెస్ బలం 36గా ఉంది. బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ అయిన పిల్లి రామరాజు కూడా కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చే అవకాశాలు కనిపిస్తుండడంతో అవిశ్వాసానికి అనుకూలంగా 37 మంది ఉన్నట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ పార్టీకి చెందిన మరో ఇద్దరు ముగ్గురు కౌన్సిలర్లు కూడా కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చే అవకాశం ఉందనే చర్చ సాగుతోంది. ఇదే కనుక జరిగితే అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా చేతులెత్తే వారి సంఖ్య 40కి చేరనుంది. ఇప్పటికే కాంగ్రెస్ చెందిన 34 మంది కౌన్సిలర్లు హైదరాబాద్‌లోని ఓ ఫామ్‌హౌస్‌లో ఉన్నారు. వారంతా నేరుగా సోమవారం జరుగనున్న సమావేశానికి హాజరుకానున్నారు.

కొత్త లిఫ్టులు మంజూరు చేస్తాం



హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

- రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్: సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నియోజకవర్గంలో అవసరమైన చోట కొత్త లిఫ్టులు మంజూరు చేస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులపై ఆదివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో నీటిపారుదల, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని నాయకులు, రైతులతో ఆయన మాట్లాడి ప్రస్తుత లిఫ్టుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఎక్కడెక్కడ లిఫ్టులు అవసరమో తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న లిఫ్టులను పూర్తి స్థాయిలో పనిచేసేలా అధికారులు చూడాలని చెప్పారు. ఎక్కడైనా లిఫ్టుల సామాన్లు ఇతర వస్తువులను ఎవరైనా తీసుకెళ్తే వెంటనే కేసుపెట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉన్న అన్ని లిఫ్టులు సమర్థంగా పనిచేసేలా చూడాలన్నారు. లిఫ్టులను దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ సీజన్‌లో గ్రామాల్లో ఉన్న అన్ని చెరువుల్లో కూడా పూడిక తీయించాలని ఆదేశించారు. చెరువుల ఆక్రమణలను సహించేది లేదని మంత్రి హెచ్చరించారు. చెరువుల భూములు ఎక్కడ ఎంత వరకు ఆక్రమణ అయ్యాయో వాటిని స్వాధీనం చేసుకోవాలన్నారు. నియోజకవర్గంలో అన్ని శాఖల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో నీటిపారుదల సీఈ ఓవీ రమేష్ బాబు, ఎస్ఈ నర్సింహారావు, ఈఈలు శ్రీనివాస్, సత్యనారాయణ, డీఈలు, ఏఈలు, నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రీశుడికి వెండి పూలబుట్ట బహూకరణ

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి హైదరాబాద్‌లోని ఓమెగా ఆస్పత్రి ఎండీ టి.శ్రీకాంత్‌రావు వెండి పూలబుట్ట బహూకరించారు. ఆదివారం శ్రీస్వామి వారిని దర్శించుకున్న అనంతరం కిలో వెండితో తయారు చేయించిన పూలబుట్టను ఆలయ అధికారులకు సువర్ణ పుష్పార్చన మూర్తుల చెంత అందజేశారు. శ్రీస్వామి వారికి పుష్పార్చన చేసే సమయంలో ఈ పూల బుట్టను వినియోగించనున్నారు.



ఆలయ అధికారులకు వెండి పూలబుట్ట అందజేస్తున్న దాత శ్రీకాంత్‌రావు

రైతుబంధు వేగవంతం!

- ఇప్పటి వరకు ఎకరం లోపు భూమి ఉన్న రైతులకే డబ్బులు జమ
- 26 రోజులుగా రైతులకు తప్పని ఎదురుచూపు
- వెంటవెంటనే జమ చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి ఆదేశాలు
- నేటి నుంచి దశాల వారీగా జమ కానున్న పెట్టుబడి సాయం



నల్లగొండ టౌన్ : యాసంగి సీజన్ రైతుబంధు డబ్బుల జమ నేటి నుంచి వేగవంతం కానుంది. గత డిసెంబర్ 12న రైతుల ఖాతాల్లో రైతుబంధు జమచేసే కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. మొదటి రోజు ఎకరంలోపు భూమి ఉన్న రైతుల ఖాతాల్లో జమచేసే ప్రక్రియ ప్రారంభమైంది. అయితే ఈ కార్యక్రమం అట్టహాసంగా ప్రారంభమైనా నిధుల లేమితో ఈ ప్రక్రియ నత్తనడకన సాగింది. ప్రక్రియ ప్రారంభమై 26 రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు కేవలం ఎకరం భూమి ఉన్న రైతుల ఖాతాల్లో మాత్రమే డబ్బులు జమయ్యాయి. దీంతో రైతులు అసలు రైతుబంధు డబ్బులు వస్తాయా.. రావా అన్న మీమాంసలో ఉన్నారు. ప్రతి రోజు బ్యాంకుల చుట్టూ, వ్యవసాయ శాఖ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. యాసంగి పెట్టుబడులకు ఉపయోగపడుతాయన్న రైతుబంధు డబ్బులు జమకాకపోవడంతో పెట్టుబడుల కోసం రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

జిల్లా వ్యాప్తంగా 5,42,406 మంది రైతులు..

జిల్లా వ్యాప్తంగా 5,42,406 మంది రైతులు రైతుబంధు పథకానికి అర్హులు కాగా ప్రతి సీజన్‌లో ప్రభుత్వం రూ.624,14,84,629 వారి ఖాతాల్లో జమ చేస్తుంది. ప్రస్తుత యాసంగి సీజన్‌లో ఇప్పటి వరకు జిల్లాలో ఎకరంలోపు భూమి ఉన్న రైతులు 1,14,542 మంది ఖాతాల్లో మాత్రమే రూ.27 కోట్లు జమ చేసినట్లు వ్యవసాయశాఖ గణాంకాలు చెపుతున్నాయి. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు శనివారం రాష్ట్ర స్థాయి వ్యవసాయ శాఖ అధికారుల సమావేశంలో రైతుబంధు పథకం డబ్బులు వేగంగా రైతుల ఖాతాల్లో జమచేయాలని ఆదేశించారు. మంత్రి ఆదేశంతో సోమవారం నుంచి రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం డబ్బులను జమ చేయనున్నట్లు వ్యవసాయ శాఖ వర్గాలు చెపుతున్నాయి. దశల వారీగా జిల్లా వ్యాప్తంగా మిగిలిన నాలుగు లక్షలకు పైగా రైతుల ఖాతాల్లో రైతుబంధు డబ్బులు జమకానున్నాయి. జనవరి నెలాఖరు నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేసేలా వ్యవసాయ శాఖ అధికారులు కసరత్తు చేసినట్లు తెలుస్తోంది.

పెట్టుబడులకు ఇబ్బంది పడుతున్నాం

యాసంగి సీజన్ పూర్తి కావస్తున్నందున రైతుబంధు పథకం డబ్బులను జమచేసే కార్యక్రమాన్ని ప్రభుత్వం వేగవంతంగా పూర్తి చేయాలి. రైతుబంధు జమకాకపోవడం వల్ల పెట్టుబడులకు నానా ఇబ్బందులు పడుతున్నాం.
– సోమగోని అంజయ్య, రైతు, గుండ్లపల్లి, నల్లగొండ మండలం

క్లుప్తంగా

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

పెద్దఅడిశర్లపల్లి : ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పెద్దఅడిశర్లపల్లి మండలం తిరుమలగిరి గ్రామానికి చెందిన భాషిపాక భాస్కర్(45)లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతను కొంతకాలంగా మద్యం తాగుతూ చెడు వ్యసనాలకు బానిసగా మారాడు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులు ఎదురుకావడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ నేపథ్యంలోనే ఆదివారం అతిగా మద్యం తాగి ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొద్ది సేపటి తర్వాత కుటుంబ సభ్యులు వచ్చి చూడగా భాస్కర్ అప్పటికే మృతిచెందాడు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు సతీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రంజిత్‌రెడ్డి తెలిపారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

తిరుమలగిరి (తుంగతుర్తి) : విద్యా రంగంలో దీర్ఘకాలికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని శాసన మండలి సభ్యులు అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. తిరుమలగిరిలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సూర్యాపేట జిల్లా కమిటీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని కోరారు. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య మాట్లాడుతూ నూతన గురుకుల పాఠశాలలో సొంత భవనాలను నిర్మాణం చేసి మౌలిక వసతులు కల్పించాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాములు మాట్లాడుతూ నిలిచి పోయిన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు వెంటనే కల్పించాలని కోరారు. సమావేశంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జి.నాగమణి, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల అధ్యక్షులు సోమయ్య, వై.సైదులు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కొలిశెట్టి యాదగిరిరావు, యాకయ్య, శ్రీనివాసరెడ్డి, జి.వెంకటయ్య, ఎస్.సోమయ్య, చర్లగున సమ్మయ్య, ఆర్.యాదయ్య, వెంకన్న, నాగార్జున, నాగు వెంకటాద్రి, మారయ్య, భీమయ్య, బొజ్జ నాగయ్య, పి.నాగేశ్వరరావు, సాంబయ్య, అనిల్‌కుమార్, రమేష్, లాలు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. పలువురికి గాయాలు

చిట్యాల: ఆటో అదుపుతప్పి బోల్తా కొట్టడంతో పలువురికి గాయాలయ్యాయి. ఈ ఘటన చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామ శివారులో జాతీయ రహదారిపై శనివారం రాత్రి చోటు చేసుకుంది. చిట్యాల మండలంలోని గుండ్రాంపల్లి గ్రామానికి చెందిన కూలీలు వ్యవసాయ పనులు ముగించుకుని ఆటోలో స్వగ్రామానికి వస్తున్నారు. ఈ క్రమంలో గ్రామ శివారులోని జేబీ వెంచర్ ఎదురుగా ఆటో అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాద సమయంలో ఆటోలో పదమూడు మందికి కూలీలు ప్రయణిస్తున్నారు. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న మాలిగ దివ్య, బత్తుల అండాలుకు తీవ్ర గాయాలవగా మరికొందరికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మెరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవి తెలిపారు.

'సాక్షి' స్పెల్‌బీకి అనూహ్య స్పందన

రీజినల్ స్థాయి పరీక్షకు 150 మందికిపైగా హాజరు

ప్రతిభ కనబరిచిన వారు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం

కాజీపేట : విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు 'సాక్షి' ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రీజినల్ స్థాయి స్పెల్ బీ పరీక్షకు అనూహ్య స్పందన లభించింది. కాజీపేట శివారు తాళ్లపద్మావతి ఇంజనీరింగ్ కళాశాలలో చేపట్టిన ఈ పరీక్షకు తెలంగాణలోని ఉమ్మడి జిల్లాల నుంచి 150 మందికిపైగా విద్యార్థిని, విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా 'సాక్షి' వరంగల్ బ్రాంచ్ మేనేజర్ వి.శ్రీనివాస్ మాట్లాడుతూ మొదటిసారిగా రీజినల్ స్థాయి పోటీ పరీక్ష వరంగల్‌లో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు పోటీ పరీక్షల్లో పాల్గొనడం వల్ల ఇంగ్లిష్ పరంగా నాలెడ్జ్ పెరుగుతుందని చెప్పారు. విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసే ప్రయత్నంలో 'సాక్షి' ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజెంటింగ్ స్పాన్సర్‌గా డ్యూక్స్ వ్యాఫి, అసోసియేట్ స్పాన్సర్‌గా గ్రాట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్స్ రాజమండ్రి వ్యవహరిస్తున్నారని చెప్పారు. కాగా, తమ స్కూళ్లలో కూడా ఇలాంటి పోటీ పరీక్షలు నిర్వహించాలనుకుంటే ఆయా పాఠశాలల యాజమాన్యాలు 9505514424 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో 'సాక్షి' వరంగల్ బ్యూరో ఇన్‌చార్జ్ గడ్డం రాజిరెడ్డి, టీవీ కరస్పాండెంట్ తుమ్మ శ్రీధర్‌రెడ్డి, ఈవెంట్స్ మేనేజర్ ఎస్.సుమన్‌గుప్తా, ఎడిషన్ ఇన్‌చార్జ్ లింగయ్య, తాళ్లపద్మావతి ప్రిన్సిపాల్ అఫ్జల్ ఉన్నీసా, సృజన్, రాకేష్, యామిని, మహేందర్‌రెడ్డితో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోటీ పరీక్షలో పాల్గొన్న విద్యార్థుల మనోగతం ఇలా ఉంది..

SAKSHI SPELL Bee 2023-24

SAKSHI

SAKSHI DIGITAL MEDIA GROUP



సోమిడిలోని తాళ్ల పద్మావతి కళాశాలలో 'సాక్షి' స్పెల్‌బీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

పిల్లలు ఇంగ్లిష్‌పై పట్టు సాధిస్తున్నారు



'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెల్ బీ ఇంగ్లిష్ పోటీ పరీక్షలు పిల్లలకు ఎంతో ప్రయోజనకరంగా ఉన్నాయి. భాషపై నెలకొన్న భయాన్ని దూరం చేసేందుకు ఈ పరీక్షలు ఉన్నాయి. ఈ పోటీలకు మా కళాశాల వేదికగా మారడం సంతోషంగా ఉంది.

– తాళ్ల మల్లేశం, తాళ్ల పద్మావతి విద్యా సంస్థల చైర్మన్

ఇంగ్లిష్‌పై ఆసక్తి పెరిగింది



స్పెల్‌బీ పోటీల్లో పాల్గొనే ఉద్దేశంతో కొత్త పదాలు నేర్చుకోవడం మొదలు పెట్టిన తరువాత ఇంగ్లిష్ భాషపై ఇంకా ఆసక్తి పెరిగింది. కొత్త పదాలు కనిపించినప్పుడు వాటి స్పెల్లింగ్ పునశ్చరణ చేసుకుంటున్నా.

– పి.అధితి, రావూస్ టెక్నో స్కూల్, కరీంనగర్

ప్రయోజనకరంగా ఉంది



మాతృభాషతో పాటు ఇంగ్లిష్‌పై పట్టు సాధిస్తేనే లక్ష్యాలను చేరుకుంటాం. తరగతి పుస్తకాలతో పాటు దిన పత్రికలు చదువుతూ ఇంగ్లిష్ నేర్చుకుంటున్నా. నా ప్రయత్నానికి స్పెల్‌బీ పరీక్ష ఎంతో ప్రయోజనకరంగా ఉంది.

– మదియా, శ్రీఅరవిందో హైస్కూల్, జనగామ

ఉపాధ్యాయుల సహకారం బాగుంది



స్పెల్‌బీ పరీక్ష రాయడం వల్ల ఉత్సాహం రెంట్టింపు అయింది. ఇంగ్లిష్‌పై నాలో ఉన్న పట్టుదలను గుర్తించిన ఉపాధ్యాయులు ఈ పోటీ పరీక్షలో పాల్గొనేలా ప్రోత్సహించారు. ఫైనల్స్‌కు వెళ్తాననే నమ్మకం మరింత పెరిగింది.

– వంశిక, ఎంజేపీ, బాలికల ఉన్నత పాఠశాల, కమలాపూర్

భాష సులువు అనిపిస్తోంది



స్పెల్‌బీ ఇంగ్లిష్ పరీక్ష రాయడం వల్ల భాష సులువు అనిపిస్తోంది. ఉచ్చారణ బాగా వస్తోంది. పదాలు గుర్తు పెట్టుకోవడం, కొత్త పదాలు వెతకడం వల్ల ఇంగ్లిష్‌పై పట్టు సాధించొచ్చు. 'సాక్షి'కి కృతజ్ఞతలు.

– నిహారిక శర్మ, లిటిల్ ఫ్లవర్ హై స్కూల్, మిర్యాలగూడ

పోటీ పరీక్షలతో ఎంతో మేలు



'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పెల్‌బీ పోటీలు నాలో నూతనోత్సాహం నింపాయి. ఇంగ్లిష్ భాషపై పట్టు సాధించడానికి చక్కటి మార్గం. పాఠశాల స్థాయి నుంచే పోటీ పరీక్షలకు హాజరైతే ప్రతిభ పెరుగుతుంది.

– కె.కార్తికేయ, జయ ఐఐటీ ఒలంపియాడ్ స్కూల్, సూర్యాపేట

మరికొన్ని పదాలు నేర్చుకున్నా..



స్పెల్‌బీ పోటీల్లో పాల్గొనడం వల్ల ఇంగ్లిష్‌లో మరికొన్ని కొత్త పదాలు నేర్చుకోవడంతోపాటు ఆ పదాలు పలికే విధానం తెలుసుకున్నా. ఇప్పుడు ఎలాంటి భయం లేకుండా ఇంగ్లిష్ మాట్లాడొచ్చనే నమ్మకం పెరిగింది.

– ఎం.సాయిప్రియ, సాధన స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్, కరీంనగర్

ప్రతిభను సానబెట్టేందుకు..



విద్యార్థుల్లోని ప్రతిభను సానబెట్టేందుకు, పోటీతత్వం పెంచేందుకు స్పెల్‌బీ, ఇంగ్లిష్ పరీక్షలు ఉపయుక్తంగా ఉంటాయి. విద్యార్థులకు స్పెల్లింగ్‌లో పట్టు పెరుగుతుంది.

– బి.సాన్వి, ఒయాసిస్ హైస్కూల్, స్టేషన్‌ఘన్‌పూర్

ఏర్పాట్లు బాగున్నాయి



పిల్లలు ఇంగ్లిష్ భాషపై చక్కటి ప్రతిభ కనబర్చడంతోపాటు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచడానికి స్పెల్‌బీ ఎంతో ఉపయోగపడుతుంది. పరీక్ష ఏర్పాట్లు బాగున్నాయి. మరిన్ని పోటీ పరీక్షలు నిర్వహించాలి.

– సురేష్‌కుమార్, ఖమ్మం

మరింత పట్టు పెరిగింది



'సాక్షి' ఏర్పాటు చేసిన పోటీ పరీక్షలకు హాజరుకావడం వల్ల గ్రామర్ సులభంగా నేర్చుకున్నా. ఇంగ్లిష్ భాషపై పట్టు పెరగడంతోపాటు ఎలా మాట్లాడాలనే విషయం అర్థమైంది. ఉత్సాహంగా పరీక్ష రాశా.

– రిషిత, రామన్ స్కూల్, సోమిడి

ఉపాధ్యాయుల సహకారంతో..



ఉపాధ్యాయుల సహకారంతో ఇంగ్లిష్ గ్రామర్‌పై పట్టు సాధించా. ఆ తరువాత మాట్లాడడం నేర్చుకున్నా. స్పెల్‌బీ పోటీలకు హాజరవుతూ భాషపై మరింత పట్టు సాధించా.

– ఎస్.జస్వంత్, త్రివేణి స్కూల్, ఖమ్మం

శ్రమకు ఓర్చి పిల్లలను తీసుకొచ్చా..



'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంగ్లిష్ స్పెల్‌బీ పోటీలకు హాజరుకావాలనే తలంపుతో శ్రమకు ఓర్చి పిల్లలను తీసుకొచ్చా. ఇలాంటి పరీక్షలు రాయడం వల్ల పిల్లల్లో పోటీతత్వం అలవడుతుందనే భావనతో వచ్చాం.

– అర్చన, జనగామ

ఇంగ్లిష్‌పై భయం పోయింది



ఇంగ్లిష్‌పై నెలకొన్న భయం పోగొట్టడంలో 'సాక్షి' స్పెల్‌బీ పరీక్ష ఉపయోగపడింది. ఇంగ్లిష్ అంటే కష్టంకాదని, ఎంతో సులభంగా నేర్చుకోవచ్చనే భావన కలిగింది. సహ విద్యార్థులతో పోటీపడి పరీక్షకు సన్నద్ధమయ్యా.

– బి.సాయిపల్లవి, ఏకశిల పబ్లిక్ స్కూల్, జనగామ

చౌటుప్పల్ అబ్బాయి.. లండన్ అమ్మాయి



జంటను ఆశీర్వదిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు పల్లా వెంకట్‌రెడ్డి, ఉజ్జిని యాదగిరిరావు



ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్ : చౌటుప్పల్‌కు చెందిన సీపీఐ పట్టణ కార్యదర్శి పగిళ్ల మోహన్‌రెడ్డి కుమారుడు హేమంత్ రెడ్డి ఉన్నత చదువుల నిమిత్తం లండన్‌కు వెళ్లాడు. ఆ నగరానికి చెందిన తన స్నేహితురాలైన హార్లీని ప్రేమించాడు. వివాహం సైతం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ విషయాన్ని వారిద్దరు తమ కుటుంబ సభ్యులతో చెప్పారు. ఆయా కుటుంబీకులు అంగీకరించారు. అందులో భాగంగా ఆదివారం చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధి లక్కారం గ్రామంలో సంప్రదాయబద్ధంగా వివాహం జరిగింది. వివాహానికి ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పల్లా వెంకట్‌రెడ్డి, ఉజ్జిని యాదగిరిరావు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

కోదాడలో అర్ధరాత్రి దాబాల నిర్వాహకుల ఘర్షణ

- ఇద్దరికి తీవ్ర గాయాలు

కోదాడ: కోదాడ పట్టణ పరిధి హుజూర్‌నగర్ రోడ్డులోని రెండు దాబాల నిర్వాహకులు, అందులో పని చేస్తున్నవారు శనివారం అర్ధరాత్రి కర్రలు, బీరుసీసాలతో రోడ్డుపై వీరంగం సృష్టించారు. సుమారు 20 మంది ఒకరిపై మరొకరు దాడులకు పాల్పడడంతో ఇద్దరికి తీవ్ర, మరికొందరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. హుజూర్ నగర్ రోడ్డులో మురళీకృష్ణ, చౌదరి–2 దాబాలు పక్క పక్కనే ఉన్నాయి. శనివారం అర్ధరాత్రి ఒక దాబాకు సంబంధించిన వారు వేడుకలు జరుపుకుంటూ పక్క దాబాలో పని చేస్తున్న వంట మాస్టర్‌ని వేడుకలకు పిలిచారు. తమ వంట మాస్టర్‌ను ఎందుకు పిలిచారని దాబాల యజమానులు వాగ్వాదానికి దిగిన క్రమంలో ఇరువర్గాలు కర్రలు, బీరు సీసాలతో పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ దాడిలో మురళీకృష్ణ దాబాకు చెందిన ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ మొత్తం గొడవను కొందరు వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పెట్టడంతో పట్టణ వాసులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఈ ఘటనపై ఇరు వర్గాలపై కేసులు నమోదు చేశామని సీఐ రాము తెలిపారు.

ఓపెన్‌బార్‌లుగా దాబాలు..

హుజూర్‌నగర్ రోడ్డులో ఉన్న ఈ రెండు దాబాల్లో నిత్యం మద్యం ఏరులై పారుతుందని ఆ ప్రాంత వాసులు ఆరోపిస్తున్నారు. అర్ధరాత్రి వరకు మందుబాబుల వీరంగం సృష్టిస్తున్నారని వాపోతున్నారు. పోలీసులు కనీస చర్యలు తీసుకోకపోవడంతో కోదాడలో ఓపెన్‌బార్‌లను మించి దాబాలు నడుస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. శనివారం అర్ధరాత్రి జరిగిన గొడవకు కూడ మద్యం వ్యాపారమే కారణమని తెలిసింది.

ఆంధ్రప్రదేశ్‌లో 'మిర్యాల' డిపో బస్సుకు ప్రమాదం

- బస్సు డ్రైవర్‌తో పాటు ప్రయాణికురాలి మృతి
- మృతులిద్దరూ ఉమ్మడి జిల్లా వాసులే
- నేరేడుచర్ల, తాళ్లవీరప్పగూడెంలో విషాదఛాయలు



వినోద్‌కుమార్ (ఫైల్)



సీతమ్మ (ఫైల్)

మిర్యాలగూడ టౌన్ / నేరేడుచర్ల : సంక్రాంతి పండుగకు కూతురు వద్దకు వెళ్తున్న ఓ తల్లి, విధి నిర్వహణలో ఉన్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందడంతో మృతుల స్వగ్రామాలు నేరేడుచర్ల, దామరచర్ల మండలం తాళ్లవీరప్పగూడెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆర్టీసీ అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దామరచర్ల మండలం తాళ్లవీరప్పగూడెం గ్రామానికి పోకల వినోద్‌కుమార్ (28) మిర్యాలగూడ ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా వినోద్ మిర్యాగూడకు చెందిన సూపర్ లగ్జరీ బస్సులో శనివారం హైదరాబాద్ నుంచి ప్రయాణికులతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతికి బయలుదేరాడు. మార్గమధ్యలో ఆదివారం తెల్లవారుజామున నెల్లూరు జిల్లా గూడూరు మండలం ముంచెర్ల జాతీయ రహదారిపై రోడ్డు పక్కన నిలిచి ఉన్న లారీని వెనుక నుంచి బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ వినోద్‌తో పాటు అందులో ప్రయాణిస్తున్న నేరేడుచర్ల మున్సిపాలిటీకి చెందిన మంత్రి ప్రగడ సీతమ్మ(56) మృతిచెందగా మరో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుల్లో సీతమ్మ కుమారుడు సీతారాములు కూడా ఉన్నాడని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

కూతురు వద్దకు వెళ్తూ..

నేరేడుచర్లకు చెందిన మంత్రి ప్రగడ సీతమ్మ(56) భర్త 12 ఏళ్ల క్రితం మృతిచెందాడు. తన కుమారుడు సీతారాములుతో కలిసి పట్టణంలో నివాసం ఉంటోంది. నెల్లూరులో నివాసం ఉంటున్న సీతమ్మ కుమార్తె సంక్రాంతి పండుగకు ఆహ్వానించింది. దీంతో సీతమ్మ తన కుమారుడు సీతారాములుతో కలిసి అక్కడికి ఆర్టీసీ బస్సులో వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందింది. సీతమ్మ కుమారుడి పరిస్థితి కూడా ఆందోళనకరంగా ఉన్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. సీతమ్మ మృతితో నేరేడుచర్లలో విషాదఛాయలు అలుముకున్నాయి.

మృతుడి కుటుంబ సభ్యులకు డిప్యూటీ ఆర్ఎంఓ పరామర్శ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మిర్యాలగూడ డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ పోకల వినోద్‌కుమార్ తమ్ముడు, చెల్లెలిని స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో నల్లగొండ డిప్యూటీ ఆర్ఎం (ఆపరేషన్) మాధవి పరామర్శించారు. ప్రమాదంలో సోదరుడు మరణించాడని వారు నెల్లూరుకు వెళ్తుండగా ఆర్ఎంఓ మనోధైర్యం కల్పించారు. వారితో పాటు ఆర్టీసీ మిర్యాలగూడ డిపో మేనేజర్ బొల్లెద్దు పాల్ కూడా నెల్లూరుకు వెళ్లి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. వినోద్ మృతితో అతడి స్వగ్రామం తాళ్లవీరప్పగూడెంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలి



రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి నాగేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

భూదాన్‌పోచంపల్లి: తెలంగాణ రాష్ట్రంలో ఉన్న 350 ప్రాథమిక చేనేత సహకార సంఘాలతో పాటు టెస్కోకు వెంటనే ఎన్నికలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివారం హైదరాబాద్‌లో రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, తెలంగాణ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేశ్, తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనం శాంతికుమార్, ప్రధానకార్యదర్శి గంజి మురళి తదితరులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించి పాలకవర్గాలను ఏర్పాటు చేయాలన్నారు. కానీ గత పాలకులు 11 ఏళ్లుగా ఎన్నికలు నిర్వహించకుండా చేనేత సహకార సంఘాలను నిర్వీర్యం చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. టెస్కోకు కూడా పాలకవర్గం లేకపోవడంతో సహకార సంఘాల్లోని చేనేత కార్మికులకు ఉపాధి కల్పించలేకపోతున్నారని అన్నారు. వస్త్రాలను కూడా కొనుగోలు చేయకపోవడంతో సంఘాల్లో కోట్లాది రూపాయలు విలువైన వస్త్ర నిల్వలు పేరుకుపోయాయని వాపోయారు. అదేవిధంగా కార్పొరేషన్ స్థానంలో చేనేత అభివృద్ధి బోర్డును ఏర్పాటు చేసి బడ్జెట్‌లో వెయ్యి కోట్ల రూపాయలు కేటాయించాలని డిమాండ్ చేశారు.

అజొల్లా పెంపకంతో గ్రాసం కొరతకు చెక్

పాడి పంట

నడిగూడెం : ప్రస్తుత సీజన్‌లో గ్రాసం కొరతతో పశువులను మేపలేక పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పశుగ్రాసం కొరతకు చెక్ పెట్టేందుకు అజొల్లా పెంపకమే సరైన పరిష్కారమని నడిగూడెం మండల పశువైద్యాధికారి డాక్టర్.అఖిల సూచిస్తున్నారు.

పశువులకు పోషక విలువలు

అజొల్లా తిన్న పశువులకు పోషక విలువలు అందుతాయి. ఎండబెట్టిన అజొల్లా పొడిలో 25–35 శాతం వరకు మాంసకృత్తులు, 10–15 శాతం ఖనిజ లవణాలు, 7–10 శాతం అమినో ఆమ్లాలు, కెరోటిన్, బీ–12 విటమిన్లు ఉంటాయి. అజొల్లా లిగ్నిట్ తక్కువగా ఉండడటం వలన పశువులు తేలికగా జీర్ణం చేసుకుంటాయి. ఒక కిలో అజొల్లా ఉత్పత్తికి 20–30 పైసలు మాత్రమే ఖర్చు అవుతుంది.

మేపేది ఇలా..

తొట్టి నుంచి తీసుకొచ్చిన అజొల్లా చదరపు సెంటీమీటరు వెడల్పు ఉన్న రంధ్రాలు గల ప్లాస్టిక్ ట్రేలో ఉంచాలి. దానిని సగం నీరు నింపిన బకెట్‌పై పెట్టి పైనుంచి నీరు పోయాలి. ట్రేలో పైన ఉన్న అజొల్లాను పశువులకు మేపాలి. ట్రేలోని రంధ్రాల ద్వారా చిన్న చిన్న అజొల్లా మొక్కలు బక్కెట్టులోని నీళ్లలోకి వెళతాయి. ఈ నీటిని మరలా బెడ్‌లో పోయడం వలన అజొల్లాను తిరిగి పెంచవచ్చు. అలాగే ప్రస్తుతం నడిగూడెం, కోదాడ మండలాల్లో చుట్టు పక్కల వరి పొలాలో కూడా అజొల్లా కన్పిస్తున్నది.



అజొల్లా తయారు చేసిన తొట్టి

అజొల్లా వాడకంతో లాభాలు ఇవీ..

ప్రతి రోజు 1.5 నుంచి 2 కిలోల అజొల్లాను పశువులకు దాణాలో కలిపి తినిపించవచ్చు. దాణాలో వేరుశనగ పిండికి బదులుగా అదే పరిమాణంలో అజొల్లాను వాడవచ్చు. దీని వలన పాల దిగుబడి 15నుంచి 20 శాతం పెరుగుతుంది. పాలలో వెన్న శాతంలో పాటు ఎస్ఎన్ఎఫ్ పెరిగి ప్రతి లీటరు పాలకు 60పైసలు నుంచి 150 పైసల వరకు అదనపు ఆదాయం పెరుగుతుంది.

ఇలా పెంచాలి

సూటిగా సూర్యకాంతి పడని కొద్దిపాటి నీడ గల భూమి కలపును పూర్తిగా చదును చేసుకోవాలి. 10సెం.మీ లోతు వచ్చేలా గోతిని తవ్వాలి. అందులో చుట్టూ ఇటుకలను పేర్చాలి. ఇలా ఒక తొట్టిని 2.50 నుంచి 1.5 మీటర్ల సైజుల్లో నిర్మిస్తే అజొల్లా ఉత్పత్తి చేయవచ్చు. గోతి లోపల భూమిపై కలుపు మొక్కల వేర్లు రాకుండా ప్లాస్టిక్ సంచులు పరచాలి. దీనిపై 150 జీఎస్ఎం మందం ఉన్న ప్లాస్టిక్ షీటు వేయాలి. షీటు చివరలు ఇటుకలపై అంచు వరకు వచ్చేలా పరచాలి. ఇందుకు 3.2 మీటర్ల సైజు గల ప్లాస్టిక్ షీటు ఉండాలి. షీటు కప్పిన తొలి లోతు 10 సెం.మీ. ఉండాలి. 30 నుంచి 35 కిలోల భూసారం గల మట్టిని జల్లెడ పట్టి, మెత్తని మట్టిని ప్లాస్టిక్ షీటుపై సమానంగా పరచాలి. ఒక చదరపు మీటరుకు 10 నుంచి 12 కిలోల పశువుల పేడను 10 లీటర్ల నీటిలో పలుచగా కలిపి, దానిలో 10–20 గ్రాముల సూపర్ ఫాస్ఫేట్‌ను కలిపి పోయాలి. ఈ తొట్టిలో 7–10 సెం.మీ. ఎత్తు ఉండేలా నీరు పోయాలి. బెడ్‌లోని మట్టి, నీటిని కలియ తిప్పాలి. అజొల్లా త్వరతగతిన పెరిగి 7–10 రోజుల్లో నీటి తొట్టిను పూర్తిగా ఆక్రమిస్తుంది. 8వ రోజు నుంచి ప్రతి రోజు ఒక కిలో అజొల్లాను ఒక్కొక్క తొట్టి నుంచి తీసుకోవచ్చు. బెడ్ మీద చల్లిన ఒక కిలో అజొల్లా వారం రోజుల్లో 8–10 కిలోలు అజొల్లా ఉత్పత్తి అవుతుంది.